క్లుప్తంగా

120 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది

వేటపాలెం: చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో కిరాణా దుకాణంపై దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 120 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్. వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గ్రామంలో కిరాణా షాపుపై దాడి చేయగా 120 రాయల్ స్టాగ్ క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని ఈపూరుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ తెలిపారు. బుధవారం గాంధీ పార్కు సెంటర్, సావరపాలెం, 40 ఇండ్ల కాలనీ, పద్మనాభునిపేట, సీతారాంపేట, ఇందిరానగర్ కాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా జనావాసాల మధ్య చెత్త కుప్పలను, మురుగు, వర్షపునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

రేపటి నుంచి గ్రామ సభలు

మార్టూరు: మండలంలో గతంలో రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18వ తేదీ నుంచి నవంబర్ రెండో తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ వలపర్ల, 22 23 తేదీల్లో కోలలపూడి, 24, 25 తేదీల్లో ద్రోణాదుల, 29వ తేదీ జొన్న తాళి, 30వ తేదీ బొల్లాపల్లి, నవంబర్ 1,2 తేదీల్లో మార్టూరు గ్రామంలో గ్రామ సభలు నిర్వహించనున్నామని సమస్యలు గల రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

వరదారెడ్డికి ప్రముఖుల నివాళి



పులికండం వరదారెడ్డి (ఫైల్)

జె.పంగులూరు: మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పులికండం వరదారెడ్డి (80) బుధవారం స్వగ్రామంలో అనారోగ్యంతో మృతి చెందారు. 1995లో పాలకేంద్రం ప్రెసిడెంట్‌గా, 1999లో నీటి సంఘం అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. బుధవారం ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, ఇమ్మిడి శెట్టి సుబ్బారావు, బ్రహ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, నివాళులర్పించారు.

ఆహార భద్రత ప్రతి పౌరుడి లక్ష్యం



మాట్లాడుతున్న ప్రత్తి వెంకట సుబ్బారావు

వేటపాలెం: ఆహార భద్రత ప్రతి పౌరుడి లక్ష్యం అని పట్ట భద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భావితరాలకు ఆహార భద్రత విషయంలో మెళకువలు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంఘ సభ్యులు దివి పవన్ చక్రవర్తి మాట్లాడుతూ పౌష్టికాహారంపై చిన్నారులకు అవగాహన కల్పించాలన్నారు. సంఘ సభ్యులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రవికుమారి, గిరిజాకుమారి, స్వరూపారాణి పాల్గొన్నారు.

రంగా విగ్రహానికి శంకుస్థాపన

చినగంజాం: మండలంలోని సోపిరాల గ్రామంలో కాపు నేత వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహ ఏర్పాటుకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు బుధవారం శంకుస్థాపన చేశారు. దీంతో పాటు సుమారు రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న బస్టాండ్‌కు శంకుస్థాపన చేశారు. టీఎస్సార్ ఆంజనేయులు, కె. రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పావులూరులో నేత్రదానం



దాత దర్శి ద్రాక్షాయణిమ్మ (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పావులూరు గ్రామంలో బుధవారం దర్శి ద్రాక్షాయణిమ్మ (85) అనే వృద్ధురాలు మృతి చెందింది. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో ఇంకొల్లు రోటరీ అవయవ దాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కార్నియాలను సేకరించారు. సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), పి. భద్రిరెడ్డి, శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు, షేక్ రఫీ, చుండి సాంబశివరావు దాత కుటుంబ సభ్యులను అభినందించారు.



చీరాల: చెరువులా మారిన వాడరేవు ప్రధాన రహదారి



చినగంజాం: పల్లెపాలెం సముద్ర తీరంలో పర్యవేక్షిస్తున్న అధికారులు



చీరాల: వైఎస్సార్ కాలనీ వాసులకు సూచనలు అందిస్తున్న రూరల్ ఎస్సై శివకుమార్

తీరంలో టెన్షన్..టెన్షన్

చినగంజాం: బంగాళాఖాతంలో అల్పపీడనం దృష్ట్యా మత్స్యకారులు చేపట వేటకు వెళ్లొద్దని సముద్రతీరంలోని మత్స్యకార గ్రామాల్లో హెచ్చరికలు చేశారు. గడచిన నాలుగు రోజులుగా తీరం వెంబడి విధులు నిర్వహిస్తున్న అధికారులు బుధవారం కూడా పలు తీరప్రాంత గ్రామాల్లో పర్యటించారు. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను తెలుసుకుంటూ, తీరంలోని సముద్రం స్థితిగతులను పరిశీలిస్తున్న అధికారులు సముద్రం లోనికి వేటకు వెళ్ళేవారిని అడ్డుకునేందుకు కృషి చేశారు. అదే విధంగా సముద్రంలోకి వచ్చే సందర్శకులను సైతం వెనక్కు పంపించి వేశారు. బుధవారం అధికారులు పల్లెపాలెం పంచాయతీ పరిధిలోని బాపయ్య నగర్ గ్రామ సమీపంలోని సముద్ర తీరంలో తిరిగి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. నాగేంద్ర బాబు, వీఆర్వో ముతకని పద్మ, మత్స్యశాఖ గ్రామ సహాయకులు నాగుబాము పుల్లారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న నాగన్న వాగు

చినగంజాం: ఉప్పుగుండూరు నుంచి పెదగంజాం వెళ్ళే మార్గంలో ఉన్న నాగన్న వాగు భారీ వర్షాల కారణంగా గత నాలుగు రోజుల నుంచి పొంగి ప్రవహిస్తుండటంతో అధికారులు బుధవారం సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. అటువైపుగా వాహనాలు, రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, డిప్యూటీ తహసీల్దార్ యూ. శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఎస్ రమేష్, నీలాయపాలెం సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



చీరాల: వాడరేవు తీరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు



వాగును దాటేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చీరాల టౌన్: వాడరేవు వైఎస్సార్ కాలనీలో వర్షపు నీరు తొలగింపు గతనాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాడరేవు వైఎస్సార్ కాలనీ, సునామీ కాలనీల్లోకి ఇళ్ల చుట్టూ వర్షపునీరు చేరడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రూరల్ ఎస్సై శివకుమార్ జేసీబీతో నీటిని తొలగింపు చేశారు. వీఆర్వో శేఖర్ పర్యవేక్షణలో వర్షపునీటిని సముద్రం వైపుకు మళ్లించారు. ఇళ్ల చుట్టు నీరు నిల్వ లేకుండా చేయడంతో పాటు వివిధ ఏర్పాట్లు చేశారు.

వర్షపునీటితో నిండిన రోడ్లు

గత నాలుగురోజులుగా కురిసిన వర్షానికే వాడరేవులోని ప్రధాన రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని రోడ్లన్నీ వర్షం ధాటికి చెరువులుగా మారుతున్నాయి. వాడరేవు ప్రధాన రహదారి మొత్తం చెరువును తలపిస్తోంది. రోడ్లపై రెండు అడుగుల మేర నీరు చేరడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు.

రాకపోకలకు అంతరాయం

చినగంజాం: మండల కేంద్రం చినగంజాం– పెదగంజాం నుంచి రాకపోకలు స్తంభించాయి. వరదల కారణంగా గ్రామం చుట్టూ పక్కల ఉన్న వాగులు కాలువలు నిండుకుండలా తలపిస్తున్నాయి. పెదగంజాం, చినగంజాం కలిసే ఎన్టీఆర్ వారధి నుంచి పెదగంజాం కలిపే రోడ్డు మధ్యలో ఉన్న తూములు బ్రిడ్జి పూర్తిగా మునిగి పోయాయి. ఉప్పుగుండూరు, పెదగంజాం మధ్య నాగన్న వాగు వాదలో చప్టా, రైల్వే అండర్ పాస్ పూర్తి అలుగు పారటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెదగంజాం నుంచి కనపర్తి వెళ్లే మార్గం మధ్యలో బకింగ్‌హాం కాలువ ఉగ్రరూపం దాల్చడంతో రాకపోకలు లేకుండా పోయాయి. పెదగంజాం నుండి రాకపోకలు పూర్తిగా నిలిచి పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

గర్భిణిని వాగు దాటించిన డీటీ

హైరిస్కు గర్భిణీ అయిన వల్లభుని విజయను డిప్యూటీ తహసీల్దార్ యు. శ్రీనివాసరావు, గ్రామస్తుల సాయంతో సురక్షితంగా వాగు దాటించి పంపారు. అంతా వారిని అభినందించారు. అనంతరం ఆమెను 108 వాహనంలో చీరాల ఏరియా హాస్పిటల్‌కు పంపించారు.

చినగంజాం: మండలంలో వర్షం కారణంగా వరి పంటలు నీట మునిగాయి. మండల వ్యవసాయాధికారి కె. భాస్కరరావు ఆధ్వర్యంలో పలు రకాల పంటలను పరిశీలించారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



నీటమునిగిన వరిని గురించి రైతులకు వివరిస్తున్న ఏఓ భాస్కరరావు



నాగన్న వాగువద్ద అధికారులు



గర్భిణిని సురక్షితంగా వాగు దాటించిన డీటీ శ్రీనివాసరావు



పెదగంజాంలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఏఓ, సిబ్బంది

ప్రయాణం ప్రయాసే!

- గోతుల మయంగా తిమ్మాయపాలెం–మోదేపల్లి రహదారి
- కనీసం మరమ్మతులకూ దిక్కులేదు
- ఆందోళనలో వాహనదారులు

అద్దంకి: రహదారులు నరకప్రాయంగా మారుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తిమ్మాయపాలెం నుంచి మోదేపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. ముఖ్యంగా తిమ్మాయపాలెం నుంచి కుంకుపాడు వరకు ఉన్న రెండు కిలోమీటర్లలో వాహన ప్రయాణం చేయాలంటే రెండు గంటలు పైగా పట్టే దుస్థితి నెలకొంది. రహదారికి వేసిన బీటీ పూర్తిగా కోసుకుపోవడంతో అడుగుకో గుంత.. గజానికో గొయ్యిగా పరిస్థితి మారింది.

మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని దర్శి–అద్దంకి రహదారి నుంచి దక్షిణం వైపుగా కుంకుపాడు, రాళ్లపల్లి–మోదేపల్లి, ధేనవుకొండ వరకు వెళ్లే రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ద్విచక్రవాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు, ఆర్టీసీ బస్సులు నిత్యం తిరుగుతూ ఉంటాయి. వాహనాల రద్దీ బాగా ఉండడంతో మొదట్లో పగుళ్లు.. ఆ తర్వాత పెచ్చులు లేవడం మొదలయ్యాయి. ప్రస్తుతం రహదారికి వేసిన బీటీ అక్కడక్కడ మాత్రమే మిగిలింది. అడుగు దూరం కూడా సక్రమంగా లేదు. ఇలా ఈ రహదారి వాహనదారులకు నరకప్రాయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు గమనించి రహదారికి మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కోసుకుపోయి మధ్యలో మిగిలిన బీటీ



గోతులతో ఉన్న రహదారి

రహదారికి మరమ్మతులు చేయాలి

మా ఊరు నుంచి మోదేపల్లి వెళ్లే రహదారిలో నిత్యం వందలాది వాహనాలు, ఆర్టీసీ బస్సులు తిరుగుతూ ఉంటాయి. వర్షానికి పూర్తిగా గోతుల మయంగా మారింది. కనీసం మరమ్మతులు చేస్తేనే తిరగగలం. – వెంకయ్య

ఇంటికి వెళతామన్న గ్యారెంటీ లేదు

తిమ్మాయపాలెం నుంచి మోదేపల్లి వెళ్లే రహదారిలో వాహనం ప్రయాణం చేయాలంటే నరకంగా మారింది. పెద్ద గోతులు పడటంతో వాహనం ఎక్కడ కింద పడుతుందో అర్థం కావడం లేదు. ఇల్లు చేరుతామనే గ్యారెంటీ లేకుండా పోయింది. అధికారులు, నాయకులు స్పందించి మరమ్మతులు చేయించాలి. – రామయ్య

నిండు కుండలా గుండ్లకమ్మ

అద్దంకి: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలోని గుండ్లకమ్మ నది నిండుగా పారుతోంది. వినాయక చవితికి ముందు కళకళలాడి గుండ్లకమ్మ ఆ తరువాత ఎండిపోయినట్టింది. మరలా వాయుగుండల ప్రభావంతో కురిసిన వర్షాలకు కళకళాడుతోంది. గురువారం నాటికి నాటికి ఎగువ ప్రాంతం నుంచి మరింత నీరు చేరే అవకాశం ఉంది.



నిండుగా పారుతున్న గుండ్లకమ్మ నది

కులమతాలకు అతీతంగా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ

పర్చూరు (చినగంజాం): గతంలో ఏర్పాటైన ముస్లిం వెల్ఫేర్ సొసైటీ కులమతాలకు అతీతంగా పనిచేస్తుందని రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ ప్రధాన కార్యదర్శి షేక్ మీరసాబాబు అన్నారు. బుధవారం సొసైటీకి సంబంధించిన బ్యానర్, కరపత్రాలు, లోగోలను వివిధ మతాలకు చెందిన వారిచే ఆయన ప్రారంభించారు. కుప్పుస్వామి చౌదరి, వి. అబ్రహం, ఎస్. కిషోర్, షేక్ గౌస్ బాబు, మాబుల్లా పాల్గొన్నారు.



ముస్లిం వెల్ఫేర్ సొసైటీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మీరసాబాబు

పల్లె పండుగతో లాభం

మేదరమెట్ల: పల్లెలను బలోపేతం చేసేందుకు గాను పల్లె పండుగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రాజ్యలక్ష్మీ అన్నారు. కొరిశపాడు మండలంలోని రావినూతల, కుర్రవానిపాలెం, కొరిశపాడు గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలకు పూజలు చేసి ప్రారంభించారు.

చినగంజాం: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చినగంజాం పంచాయతీ సోపిరాల గ్రామంలో పలు ప్రారంభోత్సవాలను ఎంఎల్ఏ ఏలూరి సాంబశివరావు నిర్వహించారు. 7 పనులకు రూ 89.90 లక్షలు మంజూరయ్యాయి. సోపిరాల గ్రామంలోని సత్యం స్కూల్ వెంబడి రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి పూజా కార్యక్రమాలను నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, డీటీ యు. శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి ఉపాధి పీడీ విజయలక్ష్మి, పంచాయతీ రాజ్ ఈఈ రామకృష్ణ, ఏఈపీఆర్ఓ కె. రామచంద్రుడు పాల్గొన్నారు.



పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రావినూతలలో పాల్గొన్న గ్రామస్తులు

పోతినవారిపాలెం (కారంచేడు): ఎంపీడీఓ నేతాజీ బుధవారం ఆయన పోతినవారిపాలెం, దగ్గుబాడు గ్రామాల్లో నాయకులతో కలిసి భూమి పూజలు చేశారు. సర్పంచ్ పోతని శ్రీనివాసరావు, పోతిన వెంకట్రావు, షేక్ ఖాశీంసాహెబ్, తిరుమలశెట్టి శ్రీహరి, పీఆర్ జేఈ దాసు, కార్యదర్శి, ఇతరశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామదేవత పోలేరమ్మ తల్లి , పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారికి, పోతురాజుకు బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు.

తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఎక్కడ?

చినగంజాం: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అని ఇచ్చిన హామీ తుంగలో తొక్కిందని మాల మహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్ ఓ ప్రకటనలో అన్నారు. గత ప్రభుత్వ మద్యం పైన వచ్చిన ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరిందని.. అయితే నేడు కూటమి ప్రభుత్వ మద్యం పాలసీలో ఆదాయం మాత్రం ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందన విమర్శించారు.

యాజమాన్య పద్ధతులతో లాభం

జె.పంగులూరు: మండల పరిధిలోని కొండమూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వై. రామకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు కె.వి శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. సర్పంచ్ బండి శివకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మినుము పంట పూర్తిగా పాడైపోయిందని తెలిపారు. దీంతో నష్టపోయిన రైతులకు న్యాయం చేసేవిధంగా చూస్తామని అధికారులు తెలిపారు. అనంతరం రేణింగవరం, కొండమూరులో వర్షాలకు నష్టపోయిన పంటను పరిశీలించారు. నాలి దీనిష్, శివాణి, పృథ్వీ ఫిలిప్స్, రైతులు పాల్గొన్నారు.



బొల్లాపల్లిలో మినుము పంట పరిశీలిస్తున్న అధికారులు



బల్లికురవ: మాట్లాడుతున్న ఏవో కుమారి

బల్లికురవ: రైతులు అధికారుల సూచనలు సలహాలు పాటిస్తే సాగులో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారి ఎస్వీపీ కుమారి అన్నారు. మండంలోని కొమ్మినేని వారిపాలెం, వైదనలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి కుమారి మాట్లాడుతూ వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు మిన్నేకంటి రామారావు, వెంకాయమ్మ, పవన్ సాయి, సాయి, రైతులు పాల్గొన్నారు



కొండమూరులో పాడైన మినుము పంట పరిశీలిస్తున్న అధికారులు

మేదరమెట్ల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలంలో నీరు నిల్వకుండా చూసుకోవాలని కొరిశపాడు మండల వ్యవసాయాధికారి పి.శ్రీనివాసరావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రాచపూడి గ్రామంలో బుధవారం కార్యక్రమం జరిగింది. ఏవో మాట్లాడుతూ మిరప, మినుము పంటలకు ఆకుమచ్చతెగులు వచ్చే ప్రమాదం ఉందన్నారు.

మార్టూరు: ఇటీవల కురుస్తున్న వర్ష తీవ్రతకు దెబ్బతిన్న మినుము పంటను జిల్లా వ్యవసాయ అధికారి వై. రామకృష్ణ బుధవారం పరిశీలించారు. మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు ఏవో వి. కిరణ్ కుమార్తో కలిసి మండలంలోని బొల్లాపల్లి తాటివారిపాలెం గ్రామాల్లో పర్యటించిన మినుము పరిశీలించారు. సిబ్బంది మౌలాలి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: పూలు, కూరగాయాల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారి ఎస్. దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గోపనబోయిన అంజయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహయకురాలు అనూష తదితరులు పాల్గొన్నారు.



రాచపూడిలో సూచనలు ఇస్తున్న ఏఓ శ్రీనివాసరావు